క్లుప్తంగా

నగరేశ్వర స్వామి ప్రసాద కైంకర్యానికి విరాళం



నగరేశ్వరస్వామి భక్తబృందం ప్రతినిధులకు బాండ్ అందిస్తున్న ఈఓ పెద్దింట్లరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ జనార్ధన, శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ నగరేశ్వర స్వామి వారికి ప్రతి సోమవారం స్వామివారి ప్రసాద కైంకర్యం నిమిత్తం శ్రీ నగరేశ్వర భక్త బృందం ప్రతినిధులు రూ. 1,01,116లు విరాళంగా సమర్పించారు. గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావుకు ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును శ్రీ నగరేశ్వర భక్త బృందం ప్రతినిధులు తోట కిషోర్, పడవల శేషు ప్రసాద్, రెడ్డి కృష్ణ తాడిచర్ల రమేష్‌లు అందజేశారు. భక్తులు సమర్పించిన మొత్తానికి ఈఓ పెద్దింట్ల రావు వారికి బాండ్‌ను అందజేశారు. స్వామి వారి పూజా కైంకర్యాల నిమిత్తం భక్తులు విరివిగా విరాళాలు సమర్పించాలని ఈఓ కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండ



కానిస్టేబుల్ మధుకుమార్ కుటుంబానికి తమ వంతు సహాయాన్ని అందిస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన కానిస్టేబుల్ దాసరి మధుకుమార్ కుటుంబానికి పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. కానిస్టేబుల్ మధుకుమార్‌తో పాటు పోలీస్ శాఖలో అడుగుపెట్టిన 2013 బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమవంతుగా చేయి చేయి కలిపి రూ.2.47 లక్షలను సేకరించి ఆయన కుటుంబానికి గురువారం అందజేశారు. తమతోపాటు ఎంతో ఉత్సాహంగా పనిచేసే కానిస్టేబుల్ మధుకుమార్ అనారోగ్యంతో మృతి చెందడంఎంతో బాధించిందని పోలీస్ సిబ్బంది వాపోయారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సీఐ బోనం ఆది ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శవంతం

ఏలూరు (టూటౌన్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శవంతమైనదని పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి మోహన్, ఎన్‌వైఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే బాషా అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని స్థానిక జ్యూట్‌మిల్లు సెంటర్‌లోని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గిరిజనులతో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ నాయులు ప్రశాంత్,రాజా, ఎన్‌వైఎస్ సభ్యులు గణపతి, శ్రీను, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో

మన్యం వీరుడిగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పేరు పొందిన సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి, సీపీఎం జిల్లా ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ 10వ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఘన నివాళులర్పించింది. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు, అల్లూరు సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి సీపీఎం కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ.శ్యామలరాణి, పి.హైమావతి, జి.శారద, పి.దుర్గ, ఎం.సింహాచలం, వి.సాయిబాబు, వైఎస్ కనకారావు, కె.లెనిన్, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని విద్యుత్ భవన్‌లో గురువారం మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు అల్లూరి సేవలను కొనియాడారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఓ కే.సత్య కిషోర్, ఈఈలు ఎస్ఎస్ అప్పారావు, టి.శశిధర్, ఏఓ రెవెన్యూ కె.గౌరి, నాయకులు తురగా రామకృష్ణ, ఎం.రమేష్, పీ.శ్రీనివాస్, ఆర్.భీమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

యోధుల త్యాగాలే నేటి స్వేచ్ఛ

ఏలూరు టౌన్: భారతదేశ ప్రజలకు బ్రిటీష్ పాలకుల నుంచి విముక్తి కోసం ఆనాడు యోధులు వీరోచిత పోరాటాలు, త్యాగాలను మరువలేమని ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కర్రి అరుణ తెలిపారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో గురువారం మన్యం వీరుడు అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ట్రెజరర్ రమా సత్యవతి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, కమిటీ సభ్యులు పద్మలత, అరుణ, గవ్వా లక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాకర్స్ ఆధ్వర్యంలో

దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఎందరో మహానేతలు తమ ప్రాణాలను త్యాగం చేశారని, గిరిజనుల హక్కుల సాధనకు పోరాటం చేసిన మహనీయులు అల్లూరి సీతారామరాజు అంటూ ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎం అక్బర్ కొనియాడారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో విప్లవ వీరులు అల్లూరి 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ జగదీష్, సీనియర్ వాకర్ కట్ల సత్యనారాయణ, ఎస్‌కే సత్తార్, లాలు సాహెబ్, సామాజిక సేవకులు గొంతిన రామకృష్ణ, మాధవ రావు, జంపా సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఏలూరు (టూటౌన్) : జ్యూట్‌మిల్లు సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఏలూరు టౌన్ : అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మహిళా వాకర్స్ అసోసియేషన్ నాయకులు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యుత్ సంస్థ అధికారులు, ఉద్యోగులు



ఏలూరు (టూటౌన్) : అల్లూరి సీతారామరాజు, సీపీఎం ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న జేసీఎల్ ఎ.రాణి

ఏలూరు (టూటౌన్): సీఐటీయూ నిరంతర కార్మిక సమస్యలపై పనిచేస్తూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్(జెసిఎల్) ఏ.రాణి కొనియాడారు. సీఐటీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యవస్థాపకుడు అల్లూరు సత్యనారాయణ 10వ వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక సీఐటీయూ ఆఫీసులో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా అల్లూరి సత్యనారాయణ, సీతారామరాజు చిత్రపటాలకు వీఆర్ఎంజీ కృష్ణారావు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో 20 మంది వరకు రక్తదానం చేశారు. ఏలూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు బి.సోమయ్య, ఎం.నాగమణి, కొర్రి విజయలక్ష్మి, వి.సాయిబాబు, సుబాషిని, బి.జగన్నాథం, మొహిద్దీన్, వెంకటరమణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలి



పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటసాల స్వరపీఠం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత జాతీయ పతాక రూపశిల్పి, తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి పింగళి వెంకయ్యకు భారత అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న ప్రకటించాలని జాతీయ జెండా ప్రచార కార్యకర్త, ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపకుడు ఎస్ఎం సుభానీ డిమాండ్ చేశారు. మువ్వన్నెల జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఘంటసాల స్వరపీఠం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ ఈటి అర్జున రావు మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రూపొందించిన వ్యక్తి పింగళి వెంకయ్య తెలుగువారు కావడంతోనే ఆయనకు దక్కాల్సిన గుర్తింపు, గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పింగళి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ఆయన జయంతి రోజును జాతీయ సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుభానీ మాట్లాడుతూ పింగళి వర్ధంతి రోజున తమ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పతాకాలు తయారీ మొదలు పెట్టామని, వీటిని మూడు సైజుల్లో అందిస్తామన్నారు. వాటిలో రస్ పతాకం, వందన పతాకం, హర్ ఘర్ తిరంగా పతాకం అనే మూడు సైజులు ఉంటాయన్నారు. పతాకాల తయారీ అనంతరం మాజీ ప్రధాని నెహ్రూ పార్లమెంట్‌లో పతాకాన్ని ప్రవేశపెట్టిన రోజైన జూలై 22 నాటికి పతాకాలు ప్యాక్ చేసి ఆగస్టు 2న పింగళి జయంతి రోజు స్కూల్స్‌కి, కాలేజీలకి, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. తొలుత పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల స్వరపీఠం కోశాధికారి కొమ్మోజు శ్రీనివాసరావు, తమ్మిన శివపార్వతి, మల్ల మౌనిక పాల్గొన్నారు.

శివయ్యకు రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వన్‌టౌన్ వెంకన్న చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్‌లైన్ల వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వెంకన్న చెరువు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, 7 కాలువల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా గుడి సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ గుడి ఏరియా, ఫిల్ హౌస్ పేట, వీవర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం ఏరియా, కందకం రోడ్డు, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోదావరి వరదను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

వేలేరుపాడు: గోదావరి వరదను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. గురువారం వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో వరదపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు గోదావరి వరదను దృష్టిలో ఉంచుకొని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో రెవెన్యూ అధికారులు ముందు జాగ్రత్తగా గ్రామాలు ఖాళీ చేయించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలం వద్ద మొదటి, రెండో, మూడో ప్రమాద హెచ్చరికల ఆధారంగా వరద ప్రభావిత గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వరద బాధితుల కోసం వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, టోల్ ఫ్రీ నంబర్‌లు ఇవ్వాలని ఆదేశించారు. రెండు మండలాల్లో బఫర్ స్టాక్ మూడు నెలలు సరిపడా నిత్యావసరా లు సిద్ధంగా ఉంచాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా వేలేరుపాడు, కుక్కునూరు వైద్యాధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	00
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	19

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	94
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	10, 15
బెండకాయలు	38	కంద	64
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	38
కాకర కాయలు	56	కీరా దోస	50
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	116
బీరకాయలు (పందిరి)	50	అల్లం	180
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-56	పాలకూర	12
దొండకాయలు	28	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	28	బజాజీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	54

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి



ఏలూరులో రంగా జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు

ఏలూరు టౌన్: సమాజంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడుతూ అనేక పోరాటాలు చేసి, రాజకీయాలకు అతీతంగా ప్రజా నాయకుడిగా పేరు పొందిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా ఆశయాల సాధనకు కృషి చేయాలని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్వర్గీయ మోహనరంగా 77వ జయంతిని పురస్కరించుకుని ఏలూరు మెయిన్ బజార్ కన్నయ్య పార్కు వద్ద రంగా విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ విజయవాడలో వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పేదవర్గాల అభ్యున్నతికి పాటుపడిన రంగా మరణించి 37 సంవత్సరాలు అయినా నేటికీ కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చాటుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు సామాజిక వర్గం నేతలు సుధాబత్తుల శ్రీదేవి, రాజేష్, పామర్తి సీతారామయ్య, మధ్యాహ్నపు ప్రభాకరరావు, కిలారపు పాండురంగారావు, కంభంపాటి రామ్మోహనరావు, జల్లా హరికృష్ణ, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్ కుమార్, కర్రి శ్రీనివాస్, సబ్బన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



బాలికల వసతి గృహంలోని విద్యార్థినితో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినుల ఆరోగ్యం పట్ల సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన సూచించారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో వారు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు స్టోర్ రూమ్, వంటశాల, పరిసరాల శుభ్రతపైన మరింత దృష్టి సారించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, డీఎల్ఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం ప్రయత్నించాలి

చింతలపూడి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కూటమి నేతలు ప్రయత్నించాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ సమావేశం దొంత తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. గురవయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికై రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి, పోలవరం నిర్మాణానికి నిధులు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. రేచర్ల గ్రామంలో ప్రధాన రహదారులను అభివృద్ధి పరచాలని, గ్రామంలో ఉన్న శ్మశానవాటికకు రెవెన్యూ లెక్కల్లో ఎక్కించేందుకు సంతకాల సేకరణ చేసి అధికారులకు అందజేయాలని తీర్మానించినట్లు తెలిపారు.